క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి

ఉప్పునుంతల: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ తిప్పర్తి అరుణ అన్నారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అన్ని శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఉప్పరపల్లిలో పాఠశాల అభివద్ధి పనులు పూర్తి చేయించాలని సర్పంచి ఇంద్రారెడ్డి అధికారులను కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఎన్నికల ప్రచారం కారణంగా గంటలోపు సమావేశాన్ని ముగించారు. సమావేశంలో జెడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మణరావు, శాఖల అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీ పాల్గొన్నారు.

వైభవంగా సంతోషిమాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో అభయ ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో శుక్రవారం సంతోషిమాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు సామూహికంగా లలితా సహస్ర పారాయణం చేశారు. కార్యక్రమంలో మొల్గర వేణుగోపాల్ రావు సుజాతమ్మ, ప్రభాకర్ భాగ్యమ్మ, శ్రీనివాసులు శ్రీదేవి, రాచర్ల శివకుమార్ అరుణ, పి.సురేందర్ రెడ్డి రాజేశ్వరి, కొండల్ రెడ్డి స్వప్న రెడ్డి నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



తెలకపల్లి: రాష్ట్ర స్థాయి పోటీలకు పెద్దపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థినిలు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో విద్యార్థినులు అంజలి, శ్రీవాణి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ శ్రీనివాసులు, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



పెంట్లవెల్లి: జటప్రోల్, గోపులాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఏపీఎం గౌస్దీన్, సీసీ శోభ కోరారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు, బుక్కీపర్‌లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తులసి పూజలు

లింగాల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కార్తీక మాసం శుక్రవారం పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో తులసి పూజలు నిర్వహించారు. మహిళలు ఇండ్లలో తులసి చెట్టుకు కల్యాణం, అదే విధంగా గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు.

నిందితుడికి నాలుగేళ్ల జైలు ఖారారు

కల్వకుర్తిరూరల్: పట్టణంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడికి శుక్రవారం నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 ల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ఎస్‌ఐ రమేష్ వివరాల ప్రకారం పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన గోవిందు వరుసకు బావ అయిన ముత్యాలుపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. అప్పటి సీఐ సైదులు 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిపై నేరాభియోగ పత్రాలు కోర్టులో దాఖలు చేశారు. న్యాయమూర్తి శ్రీదేవీ నిందితుడు గోవిందుకు నాలుగు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.1000ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన

అమ్రాబాద్: పదర మండలం రాయలగండిలో ఉన్న కేజీబీవీలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీబచావో బేటీపడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎస్‌ఓ ఉమాదేవి, సువర్ణ, సునీత ఉన్నారు.

ప్రజా శ్రేయస్సే బీఆర్‌ఎస్ లక్ష్యం



జిల్లా కేంద్రంలోని వక్ఫ్‌కాంప్లెక్స్ మసీదు వద్ద ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం/తెలకపల్లి/తాడూరు: ప్రజా శ్రేయస్సే బీఆర్‌ఎస్ లక్ష్యమని ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వక్ఫ్‌కాంప్లెక్స్‌లోని మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలను ఆయన కలిసారు. అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా ఆదరించాలని ముస్లింలను కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉందని వివరించారు. ముస్లిం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బిఆర్‌ఎస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ముస్లిం విద్యార్థుల కోసం గురుకులాల ఏర్పాటు, ఆడపిల్లల పెళ్లిల కోసం షాదీముబారక్ పథకం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. మరోసారి ఆశీర్వదిస్తే సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తెలకపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. మూడోసారి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అభివృద్ధిని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. తాడూరు మండలంలోని మేడిపూర్‌లో సింగిల్ విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కిరాణం దుకాణాలు, వ్యాపార సంస్థల సముదాయాల యజమానులను కలుస్తూ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. ఎంపీటీసీ సుజాత, రామస్వామి, జైపాల్‌రెడ్డి, నరేష్, భాస్కర్, లక్ష్మయ్య, పరమేశ్వర్ ఉన్నారు.



తాడూరులో



తెలకపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఒక్క డబుల్‌బెడ్రూం ఇవ్వలే



బిజినేపల్లిలో గడప గడపకు ప్రచారంలో కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి/తెలకపల్లి/తాడూరు: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో పేదలకు 23 లక్షల ఇళ్లు నిర్మిస్తే, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కూడా ఇవ్వలేదని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బిజినేపల్లిలో గడపగడపకు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ఒక కొత్త రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. 2018 తర్వాత ఒక్కసారి మాత్రమే కొత్త పింఛన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు వ్యవసాయ భూమి, ఇంటి స్థలాలు ఉచితంగా ఇస్తే బీఆర్‌ఎస్ ధరణి పేరుతో వారికున్న భూములను మాయం చేశారని ఆరోపించారు. ఆరు గ్యారంటీ గడప గడపకు అవగాహన కల్పించారు. తెలకపల్లిలో కూచుకుళ్లకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. కాంగ్రెస్ గెలిస్తే రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉద్యోగ క్యాలెండర్, ఆడపిల్ల పెళ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం అందిస్తుందని వివరించారు. తాడూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రోహిణి, ఎంపీటీసీ రేణుక, ఉపసర్పంచ్ బుచ్చయ్య, నిరంజన్ ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి ఎమ్మెల్యేగా రాజేష్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఒక్కసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి



మాట్లాడుతున్న శిరీష

వీపనగండ్ల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కొల్లాపూర్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి శిరీష అలియాస్ బర్రెలక్క అన్నారు. శుక్రవారం మండలంలోని తూంకుంట, సంగినేనిపల్లి, వీపనగండ్లలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తానన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలన్నారు. పేద కుటుంబానికి చెందిన తనను ఆదరించాలని ఓటర్లను అభ్యర్థించారు.

మూడోసారి ఆశీర్వదించండి



రాయవరంలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

లింగాల: మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని అచ్చంపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని రాయవరం, క్యాంపురాయవరం, దారారం, పాతదారారం, చెన్నంపల్లి, పద్మన్నపల్లి, ఎర్రపెంట, శ్రీరంగాపూర్ అవుసలికుంట, కొత్తకుంటపల్లి, సూరాపూర్, అప్పాయపల్లిలో ఆయన ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమన్నారు. సబ్బండ వర్గాలకు మేలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మూడోసారి ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



వెల్టూరులో మాట్లాడుతున్న వంశీకృష్ణ

ఉప్పునుంతల/బల్మూరు: వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని అచ్చంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వంశీకష్ణ జోస్యం చెప్పారు. శుక్రవారం మండలంలోని వెల్టూరు, కొరటికల్, కంసాన్‌పల్లి, పిరట్వాన్ పల్లి, తండా, ఉప్పర్‌పల్లితో పాటు మండల కేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోలో వంశీకృష్ణ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. అదేవిధంగా బల్మూరు మండలంలోని జిన్‌కుంట, తుమ్మెన్‌పేట, కొండారెడ్డిపల్లి, గోదల్, బల్మూర్ గ్రామాల్లో వంశీకృష్ణకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ అనంత ప్రతాపరెడ్డి, అనంతరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

చారకొండ: సీఎం కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని జూపల్లి, జేపల్లి, అప్పారెడ్డిపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో జరిగిన అభివృద్ధి, పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దళిత బంధుతో దళిత కుటుంబాలల్లో వెలుగులు నింపామన్నారు. మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ యడ్మ సత్యం, బాలేమియా, విజేందర్ గౌడ్, పుట్టరాంరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, అంజనేయులు, సత్తయ్య గౌడ్, సాయి కుమార్ తదితరులు ఉన్నారు.

గ్యారంటీ లేని హామీలు నమ్మొద్దు



అన్నారంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని ఎత్తుకున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాన్‌గల్: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే కొల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రేమద్దుల, కిష్టాపూర్, కిష్టాపూర్‌తండా, గోప్లాపూర్, అన్నారం, దావాజిపల్లి, దొండాయిపల్లి, మల్లాయిపల్లి, చింతకుంట, మాందాపూర్, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 19 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న జూపల్లి నియోజకవర్గాన్ని ఏనాడు పట్టించుకోలేదన్నారు. ఆయన పాలనలో అమాయకులపై అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. 24 గంటల కరెంటా.. నాల్గు గంటల కరెంటు కావాలా..? ప్రజలు ఆలోచించుకొని ఓటు వేయాలన్నారు. ఆయా గ్రామాల్లో పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, వైస్ ఎంపీపీ కవిత, వెంకటయ్యనాయుడు, కుర్వ బాలయ్య, సోమ్‌నాథ్‌నాయక్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీఆర్‌ఎస్ ప్రచారం

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి విజయ శుక్రవారం ఖాదర్‌పాష దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ముస్లింల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, కొల్లాపూర్‌లో హర్షవర్ధన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే తల్లి బిచ్చమ్మతో పాటు, బీఆర్‌ఎస్ నాయకులు వేర్వేరుగా పట్టణంలోని వార్డుల్లో ప్రచారాలు చేపట్టారు. బీఆర్‌ఎస్ ద్వారా రైతు, మహిళా సంక్షేమం సాధ్యమని వివరించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే కరెంట్ కష్టాలు ఏర్పడతాయని, రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి వంటి పథకాలు కొనసాగవన్నారు.

పెద్దకొత్తపల్లి: యాపట్ల, ఆదిరాల, జొన్నలబొగుడ గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదిస్తే అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రసాద్ రావు, ఆదిరాల గ్రామంలో సర్పంచ్ భాగ్యమ్మ కుర్మయ్య, జొన్నలబొగుడలో సర్పంచ్ ఇందిరా రవినాయక్‌ల ఆధ్వర్యంలో ప్రచారంలో పాల్గొన్నారు.



రేమద్దులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం



ఖాదర్‌బాష దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న బీరం విజయ



కొల్లాపూర్‌లో..

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



తర్నికల్‌లో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిరూరల్/ఆమనగల్లు: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తర్నికల్, తర్నికల్ తండా, శ్రీరాంనగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, ఐక్యతా ఫౌండేషన్ వైస్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డితో కలిసి ఆయన ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అన్ని అమలు చేస్తామన్నారు. అభివృద్ధిలో కల్వకుర్తిని అగ్రభాగంలో నిలబెడుతామన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి పిల్లలు ఉన్నత విద్య చదువుకునేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ విజయ దుందుబీ ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

నియంత పాలనకు ముగింపు పలుకుదాం

పదేళ్ల నియంత పాలనకు ముగింపు పలుకుదామని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసుగుచెంది మార్పు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్‌తో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ అమలు కావాలంటే కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. తర్నికల్ తండా, శ్రీరాంనగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండుగౌడ్, పవన్‌కుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

పేదలకు అండగా కాంగ్రెస్ జెండా ఉంటుందని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత, అవినీతి పాలన సాగిస్తున్న కేసీఆర్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.కల్వకుర్తి పట్టణంలోని వివిధ మసీదుల వద్ద ముస్లింలను కలిసి తనను గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అభ్యర్థించారు. ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు వస్పుల మానయ్య, వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, కాలెమల్లయ్య, ఖాదర్, కృష్ణనాయక్, పూసల సత్యం, వస్పుల శ్రీశైలం, అలీం, నాసర్, ఫరీద్, షర్ఫుద్దీన్, శ్రీకాంత్, ఖరీం పాల్గొన్నారు.



తర్నికల్‌లో ప్రచారం చేస్తున్న కసిరెడ్డి



హాజరైన ప్రజలు

బీజేపీతోనే పేదల సంక్షేమం



కొల్లాపూర్‌లో బీజేపీలో చేరిన నాయకులతో ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎల్లేని మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై యువకులు బీజేపీలో చేరుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బొందపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో తప్పనిసరిగా బీజేపీ విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కొల్లాపూర్‌ను 19 ఏళ్లు పాలించిన జూపల్లి కృష్ణారావు, ప్రస్తుత ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిలు నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన వివరించారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే కొల్లాపూర్‌కు రైల్వేలైన్, పారిశ్రామిక జోన్ తీసుకువస్తానని ఆయన వెల్లడించారు. అదేవిధంగా ఎల్లేని సుధాకర్‌రావు కూతురు తేజస్విని పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచారం చేస్తూ ఆకట్టుకున్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు భీమేష్ ఇంటింటి ప్రచారం చేశారు. సాతాపూర్‌లో ఎల్లేని సతీమణి భారతమ్మ ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

కొల్లాపూర్: ఎన్నికల విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొల్లాపూర్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంజనగిరి వద్ద పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే అధికారులకు ఫిర్యాదులు చేయాలని, దాడులకు దిగడం సరైంది కాదన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని నిందితులను రిమాండ్‌కు పంపుతామన్నారు. అధికారులు కూడా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే వారు 14 జిల్లాలకు చెందిన 1731 మంది పోస్టల్ బ్యాలెట్‌లు పంపుతున్నట్లు తెలిపారు. 301 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను డిసెంబర్ 3 వతేదీ రాత్రి 8 గంటల వరకు కలెక్టర్ కార్యాలయం లేదా, ఆర్‌ఓ కార్యాలయంలో అందజేయవచ్చని సూచించారు. ఇంటివద్దనుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు కొల్లాపూర్ నియోజకవర్గంలో 70 మంది దరఖాస్తులు చేసుకున్నారని, వీరిలో 62 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన తెలిపారు. ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ శనివారం మధ్యాహ్నం వరకు ముగుస్తుందని పేర్కొన్నారు.

పోలీస్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్

వీపనగండ్ల: ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ రవిప్రకాశ్ కోరారు. శుక్రవారం కల్వ రాల, పుల్గర్‌చర్ల గ్రామాల్లో సీఏపీఎఫ్ పోలీసులతో గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, నిబంధనలు ఉల్లఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.